




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 11 | సంచిక : 17 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 21 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## సింగరేణి కార్మికులకు
# రూ.796 కోట్ల బోనస్ ఇస్తున్నాం

- సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ఇస్తున్నామన్న ఉపముఖ్యమంత్రి
- సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.90 లక్షల బోనస్ ఇస్తున్నట్లు వెల్లడి
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్న భట్టి

**హైదరాబాద్ పెన్ పవర్:**సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించింది. కార్మికులకు రూ.796 కోట్ల బోనస్‌ను ఇస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్‌ను ఇస్తున్నట్లు చెప్పారు.సగటున ఒక్కో కార్మికుడికి ఒక లక్షా 90 వేల రూపాయలు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి ఒక్కో కార్మికుడికి రూ.20 వేలు అదనంగా ఇస్తున్నామన్నారు. సింగరేణిలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని వెల్లడించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇప్పటి వరకు లాభాలు పంచలేదని, ఇప్పుడు తాము పంచుతున్నామన్నారు. 2023-24లో సింగరేణి లాభం రూ.4,701 కోట్లుగా నమోదయిందన్నారు. వీరందరికీ సంతోషంగా బోనస్‌ను ప్రకటిస్తున్నామని ఉపముఖ్యమంత్రి అన్నారు.



## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో విచారణ

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతమ్ రెడ్డి పిటిషన్
- గత రికార్డుల ప్రకారం 65 ఎకరాలుగా ఉందని పిటిషన్
- విచారణను సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు




**హైదరాబాద్ పెన్ పవర్:**దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై శుక్రవారం తెలంగాణ హైకోర్టులో సీజే ధర్మాసనం విచారణను చేపట్టింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతమ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి 65 ఎకరాలుగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని రెవెన్యూ, నీటి పారుదల శాఖ, హెచ్‌ఎండీఏకు నోటీసులు జారీ చేసింది.హైదరాబాద్ నగర పరిధిలోని వివిధ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలను కూల్చి వేసింది. ఈ క్రమంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది.



## టెర్రరిస్టుల పట్ల కఠినంగా ఉండాలి

### కేంద్రమంత్రి నిత్యానంద్ రాయ్


**హైదరాబాద్ పెన్ పవర్:**సైబర్ క్రైమ్ పెను సవాల్‌గా మారిందని కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్ అన్నారు. ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీలో 76వ ఐపీఎస్ ప్రొబేషనర్ల పాసింగ్

వివరాలు 2లో..

# మోడల్ స్టడీస్ కాకముందే కన్‌స్ట్రక్షన్

## రీసెర్చ్ ఇంజనీర్ల క్లారిటీ

- మూడు బ్యారేజీలపై రీసెర్చ్ ఇంజనీర్ల క్లారిటీ
- నీళ్లు స్టోరేజ్ చేయడం వల్లే మేడిగడ్డ డ్యామేజీ
- వరద వచ్చినప్పుడు గేట్లు ఎత్తడంలో నిర్లక్ష్యం
- టెయిల్ వాటర్ లెవల్ ను పాటించలేదు
- బ్యారేజీల డ్యామేజీకి మోడల్ స్టడీస్ కు సంబంధం లేదని వెల్లడి
- ఓపెన్ కోర్టులో ప్రశ్నించిన కాళేశ్వరం కమిషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** మోడల్ స్టడీస్ పూర్తి కాకముందే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని రీసెర్చ్ ఇంజినీర్లు కమిషన్ ఎదుట ఒప్పుకొన్నారు.నిర్మాణానికి ముందు, మధ్యలో, తర్వాత కూడా మో డల్ స్టడీస్ చేశామని తెలిపారు. అయితే మోడల్ స్టడీస్ పూర్తి కాకముందే పనులు మొదలయ్యాయని వివరించారు. మోడల్ స్టడీస్ తర్వాత బఫెల్ బ్లాక్ లో మార్పులు సవరణలు చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని అన్నారు. మేడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు డ్యామేజీ కావడానికి నీళ్లు స్టోరేజీ చేయడమే ప్రధాన కారణమని కమిషన్ కు తెలిపారు. వరద ఎక్కువగా వచ్చినప్పుడు గేట్లను ఎత్తకుండా ఫీల్డ్ అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు చెప్పారు. నీళ్లు నిలువ చేయాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. అలాగే అన్నారం బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మార్చిన అంశం రీసెర్చ్ ఇంజినీర్ల దృష్టిలో ఉందా..? అని ప్రశ్నించింది. 2017 నుంచి 2023 వరకు రీసెర్చ్ టీం ఆధ్వర్యంలో మోడల్ స్టడీస్ జరిపినట్టు వివరించారు. ఓ వైపు నిర్మాణం.. మరో వైపు రీసెర్చ్ అన్నట్టుగా సాగిందని వివరించారు. ఫ్లడ్ రిలేటివ్ వెలోసిటీని గేట్లు ఎత్తకుండా చేశారని అధికారులు కమిషన్ కు వివరించారు. సెకనుకు 3 నుంచి 6 మీటర్ల వేగాన్ని గేట్లు తక్కువ ఎత్తు ఎత్తి టెస్ట్ చేశారని తెలిపారు. ఆ తర్వాత 15 మీటర్లకు పెంచారని చెప్పారు. దాని వల్లే బ్యారేజీ ముందు టెయిల్ వాటర్ లేక కొట్టుకుపోయిందని తెలిపారు. టెయిల్ వాటర్ లెవల్ మెయింటేన్ చేయాల్సిన బాధ్యత ఫీల్డ్ ఇంజినీర్లదేనని అన్నారు. మేడారం. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై 12 రిపోర్టులను టీజీఈఆర్ఎల్ జేడీ కమిషన్ కు అందజేసింది.

**విచారణకు ఏడుగురు సీఈలు, అధికారులు**

జలసౌధలో కాళేశ్వరం కమిషన్ నిర్వహించిన ఓపెన్ కోర్టుకు ఏడుగురు చీఫ్ ఇంజినీర్లు హాజరయ్యారు.

వాళ్లు గతంలో సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ ప్రశ్నించింది. ఇంజినీర్లతోపాటు అడ్మినిస్ట్రేషన్ అధికారులనూ కమిషన్ ప్రశ్నించింది. ఒక్కొక్కరినీ విడివిడిగా ప్రశ్నించింది. మోడల్ స్టడీస్ పైనే కమిషన్ ప్రధానంగా దృష్టి సారించింది.



## కేంద్రమంత్రి బిట్టు తల తెచ్చిస్తే 1.38 ఎకరాల భూమి..

### తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆఫర్

- రాహుల్‌గాంధీని నంబర్ వన్ ఉగ్రవాది అన్న కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు
- ఆయన వ్యాఖ్యలపై మండిపడుతూ ఆఫర్ ప్రకటించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- బిట్టు తల తెచ్చి ఇస్తే తన ఆస్తితోపాటు తన తండ్రి ఆస్తి కూడా రాసిస్తానని హామీ
- రాహుల్ 'మొహబ్బత్ కి దుకాణ్' అంటే ఇదేనా అని బీజేపీ మండిపాటు

వివరాలు 2లో..

## రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.1 లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగింది?



- కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని మండిపాటు
- కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నిండికుండలా ఎలా ఉందని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ అని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్

వివరాలు 2లో..

## కాంగ్రెస్ తెలంగాణ రైతులను మోసం చేసింది

- తెలంగాణలో రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని వ్యాఖ్య
- కాంగ్రెస్ పార్టీకి ద్వేషమనే దెయ్యం పూనుకుందని వ్యాఖ్య
- కాంగ్రెస్ నేతలు యాంటీ ఇండియా ఎజెండాను కొనసాగిస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని, ఎన్ని కల సమయంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదని ప్రధాని మోదీ మండిపడ్డారు. మహారాష్ట్రలోని



వివరాలు 2లో..

## రూరల్‌ఏరియాలకు ఐటీని విస్తరిస్తం

పంచాయతీరాజ్‌శాఖతో నాకు పెద్ద బాధ్యత వచ్చింది

రూరల్‌ఏరియాలకు ఐటీని విస్తరిస్తం

సవాళ్లను చాలెంజ్‌లుగా తీసుకోవాలె

వర్క్‌ప్లేస్‌లో మహిళలను వేధిస్తే సహించేది లేదు

సేఫ్టీ కోసం టీసేఫ్‌యాప్‌తెచ్చాం మంత్రి సీతక్క

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:**గ్రామీణ ప్రాంతాలకు ఐటీని విస్తరిస్తామన్నారు మంత్రి సీతక్క. వ్యాపారులు కేవలం పట్టణ ప్రాంతాల్లోనే పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారు..రూరల్ ఏరియాల్లో కూడా పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించాలని కోరారు. మహిళలకు పరిశ్రమల్లో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలు



## జానీ నాలుగేళ్లుగా లైంగిక దాడి చేశాడు.. అతనే చెప్పాడు

### జానీ మాస్టర్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించిన పోలీసులు

- 2019లో జానీ మాస్టర్‌తో బాధితురాలికి పరిచయమైనట్లు తెలిపిన పోలీసులు
- దురుద్దేశంతోనే జానీ మాస్టర్ బాధితురాలిని అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడని వెల్లడి
- నాలుగేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడన్న పోలీసులు
- ఉప్పరపల్లి కోర్టు జానీకి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# తిరుమల లడ్డూకు రాజకీయ రంగు....

రాజకీయ నేతలు ఏ అంశాన్ని తేలిగ్గా వదలరు. అందులోనూ ఓటర్ల మనోభావాలపై ప్రభావం చూపే ప్రతి అంశాన్ని చూపుతుంది. ప్రధానంగా తిరుమలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. హిందువులతో పాటు అనేకమంది తిరుమల వెంకటేశ్వరుడిని తమ ఇంటి దేవుడిగా భావిస్తారు. అందుకే రాజకీయాలకు తిరుమల వేదికగా మారింది. రాజకీయ రగడకు చిరునామాగా మారుతుంది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలతో తిరుమల వివాదం మళ్లీ వెలుగులోకి వచ్చింది. తిరుమలలో గత వైసీపీ ప్రభుత్వంలో తయారు చేసిన లడ్డూలో జంతువుల నూనెను కలపారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి విషయానికొస్తే సాధారణంగా టీటీడీ మార్కెటింగ్ విభాగం ద్వారా నెయ్యిని కొనుగోలు చేస్తోంది. ప్రతి 6 నెలలకొకసారి టెండర్లు పిలిచి ఇ-ప్రోక్యూర్‌మెంట్ ద్వారా నెయ్యిని సమకూర్చుకుంటుంది. నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్ కూడా తిరుమలలోనే ఉంది. ఇన్ని అంచెలు దాటి కల్తీ నెయ్యి, అది కూడా జంతువుల కొవ్వు నుంచి తీసింది వాడటం అనే టాపిక్ భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది.ఆవు నెయ్యా?జంతువుల కొవ్వా? ఏది నిజం? × ప్రతీ రోజు 300-500 లీటర్ల నెయ్యి వినియోగం × నెయ్యిని కొనుగోలు చేసే మార్కెటింగ్ విభాగం × ప్రతీ 6 నెలలకోసారి టెండర్లు × ల్యాబ్‌లో నెయ్యి నాణ్యతపై పరీక్షలు × 2021 మార్చి వరకు నందిని బ్రాండ్ (కర్నాటక) నెయ్యి సరఫరా × తక్కువ ధరకి సప్లయ్ చేయలేమంటూ తప్పుకున్న నందిని × తమిళనాడు, ఢిల్లీకి చెందిన కంపెనీలు నెయ్యి సరఫరా2021 మార్చి వరకు టీటీడీకి కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి సరఫరా అయ్యేది. 2021 మార్చి లో జరిగిన టెండర్లలో ఒ-3 గా నిలిచింది. అయినా కూడా ఎల్-1, ఎల్-2 అనుమతితో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ తిరుమలకు అవసరైన నెయ్యిలో కేవలం 20 శాతం సప్లై చేసింది. ఆ తర్వాత నుంచి మాత్రం టెండర్ ప్రక్రియలోనే పాల్గొనలేదు. యూపీకి చెందిన ప్రీమియర్ ఎల్-1 గా, ఎల్-2గా ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేసేందుకు అర్హత పొందగా కేజీ నెయ్యి రూ. 424 లు ప్రకారం టీటీడీకి సప్లై చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ ధరకు తమకు గిట్టుబాటు కాదంటూ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ టెండర్ ప్రక్రియలోనే పాల్గొనలేదు. టీటీడీకి నాణ్యమైన నెయ్యిని తక్కువ ధరకు సరఫరా చేయలేమని ఫెడరేషన్ తేల్చి చెప్పింది. దీంతో తక్కువ ధరకు నాసిరకం నెయ్యి కొనుగోలు చేస్తుందంటూ టీటీడీపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అటు వైసీపీ హయాంలో తిరుపతి లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నిర్ధారించింది. జులై 8, 2024న లడ్డూను టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపించగా.. ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ జులై 17న నివేదిక ఇచ్చింది. అందులో అడ్డూలో వినియోగించిన పదార్థాలను వెల్లడించారు. ఆ ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం లడ్డూలో.. సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మొక్కజొన్న, పత్తి గింజలతోపాటు చేప నూనె, జంతు కొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా ఇందులో వాడినట్లు నివేదిక ఇచ్చింది. కాగా ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ కేంద్ర ప్రభుత్వంతో గుర్తింపు పొందింది. ఈ మేరకు ల్యాబ్ రిపోర్ట్‌ను టీడీపీ సీనియర్ నేత ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు అందజేశారు. తిరుమల వెంకన్న స్వామి ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై కచ్చితంగా సీరియస్ ఎంక్వయిరీ చేస్తామని ఆయన తెలిపారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగించేలా కుంభకోణానికి పాల్పడిన వారు సర్వ నాశనమైపోతారని మండిపడ్డారు. క్వాలిటీ నెయ్యి కేజీ కొనాలంటే రూ. 1000 పైగా ఖర్చవుతుందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ.320కి నెయ్యి టెండర్లు పిలిచిందన్నారు. నలుగురికి నెయ్యి టెండర్ కాంట్రాక్టు ఇచ్చారని, క్వాలిటీ నెయ్యి రూ.320కి ఇచ్చేవారు ఎవరైనా ఉన్నారా అని ఆనం వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు.చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కనుక వెంటనే దానిపై విచారణ జరిపించి.. నిజా నిజాలు తేల్చి తప్పు చేసిన వారికి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు భక్తులు.అయితే దీనిపై వైసీపీ నేత, మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఖండించారు. అలాంటి ఘటనలు జరిగి ఉంటే తాము కుటుంబ సభ్యుల మొత్తం ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, చంద్రబాబు సిద్ధంగా ఉన్నారా? అంటూ ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చంద్రబాబు తిరుమల లడ్డూపై విషప్రచారానికి దిగారంటూ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. తమ హయాంలో ఏం జరిగిందన్న దానిపై అవసరమైతే విచారణ జరిపించుకోవచ్చని, ప్రభుత్వం అధికారంలో ఉంది మీరే కదా? అంటూ ప్రశ్నించారు. తమ కుటుంబం హిందూ మతవిశ్వాసాలతో పాటు భక్తి శ్రద్ధలకు నిలయమని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. దీనికి టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తిరుమలను ఐదేళ్ల పాటు భ్రష్టుపట్టించింది మీరు కాదా? చంద్రబాబు అన్న దానిలో నిజముందంటూ ఆయన వ్యాఖ్యానించారు. నిజానికి తిరుమల లడ్డూ తయారీలో జంతువుల నూనెను వాడుతుంటే దాని తయారుదారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. తిరుమలలో లడ్డూలను తయారు చేసేది తిరుమలలోనే. అందుకు కూడా అత్యాధునికమైన వంట శాలను కూడా ఏర్పాటు చేశారు. నేతిని కాకుండా జంతువుల నూనెను అందులో వేస్తే తయారీదారులు ఎందుకు ఊరుకుంటారన్న ప్రశ్న వైసీపీ నేతల నుంచి వస్తుంది. మరోవైపు హిందూ మనోభావాలు దెబ్బతీసేవిధంగా, తిరుమల ప్రతిష్టను దిగజార్చేలా వైసీపీ, టీడీపీ ప్రయత్నిస్తున్నాయంటూ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని చంద్రబాబుకు షర్మిల సవాల్ విసిరారు. ఒకరి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రయత్నించవద్దంటూ రెండు పార్టీలకూ షర్మిల హితవు పలికారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన ఆరోపణలపై నిజానిజాలను నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు

# రూరల్‌ఏరియాలకు ఐటీని విస్తరిస్తం

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో అంతరాలు తగ్గుతాయన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకున్న..మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఇప్పుడు మంత్రిగా పట్టుదలతో ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు తక్కువ అనే ఆలోచన నుంచి బయటకు రావాలని మంత్రి కోరారు. శుక్రవారం( సెప్టెంబర్ 20) మాదాపూర్‌లోని టెక్ మహీంద్రా క్యాంపస్‌లో సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ తెలంగాణ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సును సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు సమాజ సృష్టికర్తలు అని అన్నారు. సమాజంలో మహిళలను చిన్నచూపు చూసే మెంటాలిటీ ఉంది.. అందుకే మహిళలు ఇంకా వెనకబడే ఉన్నారు. ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నా..పురుషులే గొప్ప అనే భావన ఉంది. ఆదివాసీ మహిళకు పంచాయతీ రాజ్ శాఖను ఇచ్చారు. 13 వేల గ్రామపంచాయతీలు, రెండు కోట్ల మంది ప్రజలకు సేవ చేసే బాధ్యత వచ్చింది. అందుకే బాధ్యతగా పనిచేస్తున్నానన్నారు మంత్రి సీతక్క.. మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మాపై ఉంది.. వర్క్ ప్లేస్‌లలో మహిళలకు భద్రత లేదు.. సమస్యలపై వెంటనే ప్రశ్నించడం నేర్చుకోవాలి.. ఎదురవుతున్న సవాళ్లను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు మంత్రి సీతక్క. మహిళల సమస్యల పరిష్కారానికి మరిన్ని చట్టాలు తీసుకొస్తామన్నారు మంత్రి సీతక్క.గ్రామీణ ప్రాంతాలకు ఐటీని విస్తరిస్తామన్నారు మంత్రి సీతక్క. వ్యాపారులు కేవలం పట్టణ ప్రాంతాల్లోనే పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారు.. రూరల్ ఏరియాల్లో కూడా పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించాలని కోరారు. మహిళలకు పరిశ్రమల్లో పురుషులతో

సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో అంతరాలు తగ్గుతాయన్నారు. పరిశ్రమలు స్థాపించాలనుకునే మహిళా పారిశ్రామిక వేత్తలను మా ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు మంత్రి సీతక్క. మహిళల భద్రత, సాధికారత లక్ష్యంగా మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళ భద్రతకోసం టీసేఫ్ యాప్ ను తీసుకువచ్చామన్నారు. యంగ్ ఇండియాలో నిరుద్యోగం పెద్ద సవాల్.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు మంత్రి సీతక్క.

# కాంగ్రెస్ తెలంగాణ రైతులను మోసం చేసింది

- మొదటి పేజీ తరువాయి

వార్ధాలో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణలోని రైతులు ఇప్పుడు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ అత్యంత అవినీతిమయ పార్టీ అన్నారు.తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్స్ ఆ పార్టీని నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ రోజు చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి, మహాత్మా గాంధీ లాంటి వ్యక్తితో లింకున్న పార్టీ కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ద్వేషమనే దెయ్యం పూనుకుందన్నారు. నేటి కాంగ్రెస్ పార్టీలో దేశభక్తి అనే భావనే లేదన్నారు. కాంగ్రెస్ నేతలు యాంటీ ఇండియా ఎజెండాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ వ్యవస్థపై అమెరికాలో వ్యాఖ్యలు చేసిన ఆ పార్టీ నేతను సొంత పార్టీ నాయకులే తప్పుపడుతున్నారన్నారు. అవినీతమమైన పార్టీ ఏదైనా ఉందంటే, అది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఆ పార్టీ కుటుంబ సభ్యులే పెద్ద అవినీతిపరులు అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గణపతి పూజను కూడా ద్వేషిస్తోందన్నారు. గణపతి పూజకు వెళ్తే రాజకీయాలు ఆపాదించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో గణపతి బప్పాను జైల్లో వేశారని, ఓ విగ్రహాన్ని పోలీస్ వ్యాన్‌లో పెట్టారని ధ్వజమెత్తారు. గణపతి బప్పాకు జరిగిన అన్యాయంపై మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు మాట్లాడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధాలు అని, మహారాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులను నాశనం చేసిన కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇవ్వకూడదన్నారు.

# రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.1 లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగింది?

- మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.93 వేల కోట్లు ఖర్చు అయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు.శుక్రవారం ఆయన మల్లన్న సాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారని, ఈ ప్రాజెక్టు నిజంగానే కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నిండు కుండలా ఎలా ఉందో చెప్పాలన్నారు. తమ పార్టీది వాటర్ డైవర్ట్ పాలిటిక్స్ అయితే కాంగ్రెస్ పార్టీది మాత్రం అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ అని చురక అంటించారు.

# టెర్రరిస్టుల పట్ల కఠినంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

ఔట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీతో అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో పాటు ఇతర అనేక సైబర్ సంబంధిత కార్యక్రమాలు కేంద్ర హోంశాఖ పరిధిలోకి వచ్చాయని తెలిపారు. నేరస్తులను పట్టుకొని వారికి తొందరగా శిక్షలు పడేలా చూడాలన్నారు. కొత్త క్రిమినల్ చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాగా నేషనల్‌పోలీస్‌అకాడమీలో అకాడమీలో 188 మంది ట్రైనీ ఐపీఎస్‌లు ట్రైనింగ్ పూర్తిచేస్తున్నారు. వీరిలో 54 మంది మహిళలు ఉన్నారు. ఏపీకి 4, తెలంగాణ నలుగురు ట్రైనీ ఐపీఎస్‌లను కేటాయించారు.

# కేంద్రమంత్రి బిట్టు తల తెచ్చిస్తే 1.38 ఎకరాల భూమి..

**పెన్ పవర్ డెస్క్:**కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు తల తెగ్గోసి తెచ్చిన వారికి 1.38 ఎకరాల భూమి ఇస్తానని కాంగ్రెస్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ 'నంబర్ వన్ ఉగ్రవాది' అని బిట్టు చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. రవ్‌నీత్‌సింగ్ బిట్టు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయన తల తెచ్చి ఇచ్చిన వారికి తన ఆస్తితోపాటు తన తండ్రి ఆస్తిని కూడా రాసిస్తానని ఆఫర్ ప్రకటించారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన ఆందోళన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే వెడ్మ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. రాహుల్ 'మొహబ్బత్ కి దుకాణ్' అంటే ఇదేనా అని ప్రశ్నించింది.

రాష్ట్రంలో ఇలాంటి ప్రమాదకర కవ్వింపులు, నేరపూరిత ప్రేరేపణలు సర్వసాధారణం అయ్యాయని ఎక్స్‌లో మండిపడింది. మరోవైపు, బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆందోళనలు నిర్వహించింది. కంగనపై దానం వ్యాఖ్యలను బీఆర్ఎస్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కూడా ఖండించారు.

# జానీ నాలుగేళ్లుగా లైంగిక దాడి చేశాడు.. అతనే చెప్పాడు

**పెన్ పవర్ డెస్క్:**అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ కొరియోగ్రాఫర్, జనసేన నేత జానీ అలియాస్ జానీ భాషా అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఉప్పరపల్లి కోర్టు జానీకి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో పోలీసులు అతడిని చంచల్ గూడ్ జైలుకు తరలించారు. అయితే, కొరియాగ్రాఫర్ జానీ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. తమ విచారణలో జానీ నేరాన్నీ అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే జానీ ఆమెను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడన్న పోలీసులు.. నాలుగేళ్లుగా బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి చేసినట్లు వెల్లడించారు. 2020లో ముంబైలోని ఓ హోటల్ లో కూడా జానీ లైంగిక దాడికి పాల్పడినట్లు.. ఈ విషయాన్ని విచారణలో జానీనే ఒప్పుకున్నట్లు తెలిపారు. లైంగిక దాడి జరిగినప్పుడు బాధితురాలి వయసు 16 ఏళ్లని వెల్లడించిన పోలీసులు.. జానీ భార్య కూడా బాధితురాలిని బెదిరించిందని జానీ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తనపై నమోదైన కేసుపై స్పందించిన జానీ.. ఇది అక్రమ కేసు అని.. తనను కావాలని టార్గెట్ చేశారని అన్నారు. తనను ఇరికించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారన్న జానీ.. లీగల్‌గా ఫైట్ చేస్తానని స్పష్టం చేశారు. తనను టార్గెట్ చేసిన ఎవరిని వదలనని.. వడ్డీతో సహా చెల్లిస్తానని జానీ హెచ్చరించారు. జానీ వెర్షన్ ఇలా ఉంటే.. పోలీసులు మాత్రం రిమాండ్ రిపోర్టులో జానీ నేరం అంగీకరించాడని పేర్కొనడం సంచలనంగా మారింది. దీంతో కొరియోగ్రాఫర్ జానీ కేసుపై ఉత్కంఠ నెలకొంది.

# దసరాకు ఇంద్రకీలాద్రి ముస్తాబు

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 20:**

దసరా వచ్చేస్తుంది. అందులోనూ విజయవాడ దుర్గ గుడిలో జరిగే దసరా వేడుకలు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎంతో ఫేమస్. అయితే ఇటీవల విజయవాడ నగరం మొత్తం వరదలతో ఇబ్బంది పడడంతో ఈసారి దసరా వేడుకలు గతంలోలా జరుగుతాయా లేదా అమ్మవారి వైభవాన్ని ఈ ఏడాది చూడగలమా లేదా అని భక్తులు సందేహించారు. కానీ ఈసారి కూడా దుర్గ గుడిలో దసరాను ఎంతో వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. అక్టోబర్ 3 నుంచి 12 వరకూ దసరా నవరాత్రులు జరుగుతాయని దుర్గగుడి కమిటీ తెలిపింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే సామాన్య భక్తులకు సైతం సంతృప్తికరంగా అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. సృజన అధికారులను ఆదేశించారు. ఇంద్రకీలాద్రి కొండపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. కొండ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందనీ అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా మరింత అలర్ట్ గా దుర్గ గుడి అధికారులు ఉండాలన్నారు. పాత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు

అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.దసరా ఉత్సవాలలో ప్రతి రోజు లక్ష మందికిపైగా భక్తులు వస్తారని.. మూలా నక్షత్రం రోజున రెండు నుంచి మూడు లక్షల మంది వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు జిల్లా కలెక్టర్. దీనిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ వల్ల గాని వర్షం వల్ల గాని క్యూలైన్‌లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దాతల సహకారంతో తాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజున అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని ఆ సమయంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సృజన తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... దసరా ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుంచి లక్షల మంది అమ్మవారి దర్శనానికి తరలివస్తారు కాబట్టి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు చెందిన పోలీసులతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే 3,500 మంది సిబ్బంది సేవలను దసరా ఉత్సవాల?లో వినియోగిస్తామన్నారు. ఏర్పాట్ల పరిశీలనకు ప్రతి సెక్టార్ కి ఒక స్పెషల్ ఆఫీసర్ పరిశీలనలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. దుర్గ గుడి ఘాట్ సమీపంలో గల కమాండ్ కంట్రోల్ ద్వారా దసరా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ గతం కంటే మరింత మెరుగ్గా దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు భక్తుల సలహాలు తీసుకునేలా ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించాలని తెలిపారు. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు విఐపిలు, వివిఐపిలకు ప్రత్యేక టైమ్ స్లాట్‌లను కేటాయించి వారికి ముందుగానే తెలియపరిచి ఆయా సమయాలలోనే అమ్మవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయని ఆయన సూచించారు. భక్తులకు హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసి వెయిటింగ్ లేకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దుర్గ గుడి ఈవో కె.ఎస్. రామరావు మాట్లాడుతూ ఈ ఉత్సవాలలో అమ్మవారు పది అవతారాలలో భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. అక్టోబర్ 3వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి, 4న శ్రీ గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి, 7న శ్రీ మహాచండీ దేవి, 8న శ్రీ మహలక్ష్మి దేవి, 9న శ్రీ సరస్వతి దేవి, (మూలా నక్షత్రం) 10న శ్రీ దుర్గాదేవి, 11న శ్రీ మహిషాశు రమర్ధినీ దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి అలంకారంతో దర్శనం ఇస్తారన్నారు. ఆన్లైన్ టికెట్ లేకుండా వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రిసెప్షన్, టోల్‌గేట్, హోమ్ టర్నింగ్, పున్నమి ఘాట్, వియంసి ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద కరెంటు టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.వినాయకుడి గుడి నుంచి టోల్‌గేట్ ద్వారా కొండపైన ఓం టర్నింగ్ వరకు మూడు క్యూ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓం టర్నింగ్ వద్ద ఉచిత దర్శనం, వి ఐ పి క్యూ లైన్లతో కలిపి మొత్తం 5 క్యూ లైన్లు ఉంటాయన్నారు. భక్తులకు తాగునీరు అందించేందుకు ఈ ఏడాది వాటర్ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిళ్లను కూడ సరఫరా చేయనున్నామన్నారు. కనకదుర్గానగర్ వద్ద ప్రత్యేక ప్రసాదం కౌంటర్లుతోపాటు కొండపైన ఓం టర్నింగ్ వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని 25 లక్షల లడ్డులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రథం సెంటర్, మున్సిపల్‌ఆఫీసు, సీతమ్మ వారి పాదాలు, కుమ్మరి పాలెం, పున్నమి ఘాట్ వద్ద ఉచిత చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.భక్తులు స్నానమాచరించేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద 500 షవర్స్, పున్నమి ఘాటు వద్ద 100, భవాని ఘాట్ వద్ద 100 షవర్స్‌లతో పాటు 150 టెంపరరీ మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు అమ్మవారి ఉచిత ప్రసాదం కింద పులిహోర, కట్టు పొంగలి, దద్దోజనం, సాంబారు రైస్ మహామండపం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి జరుగుతున్న దసరా వేడుకలు కావడంతో వీటిని సూపర్ సక్సెస్ చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది

# దసరా నాటికి ఏపీ నామినేటెడ్ లిస్ట్ రెడీ

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 20:** ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు అవుతోంది. రేపటికి వంద రోజులు పూర్తికానుండడంతో సంబరాలు చేసుకుంటున్నాయి ఆ మూడు పార్టీలు. అయితే ద్వితీయ శ్రేణి నాయకత్వం మాత్రం ఆశించిన స్థాయిలో సంతృప్తిగా లేదు. నామినేటెడ్ పదవుల భర్తీ జరగకపోవడంతో చాలామంది అసంతృప్తితో ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని అంతా భావించారు. కానీ రకరకాల కారణాలు చూపి వాటిని వాయిదా వేస్తూ వచ్చారు. ఆగస్టు 15న నామినేటెడ్ పోస్టుల ప్రకటన ఉంటుందని ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో సైతం ఫలానా వారికి ఫలానా పదవులు అంటూ ప్రచారం సాగింది. అయితే అటువంటిదేమీ లేకుండా పోయింది. మధ్యలో వరదలతో అటు ఇటుగా మూడు వారాలు సాగిపోయింది. ఇప్పుడు సాధారణ పరిస్థితులు రావడంతో మళ్లీ నామినేటెడ్ పదవులపై ప్రచారం ప్రారంభమైంది. ఈరోజు సాయంత్రానికి నామినేటెడ్ పదవుల జాబితాను ఖరారు చేస్తారని.. ఒకటి,రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని తెలుస్తోంది. దీంతో మూడు పార్టీల్లో ఒక రకమైన టెన్షన్ నెలకొంది.ఏపీలో మూడు పార్టీలు కలిసి ఉమ్మడిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కూటమి ప్రభుత్వం కావడంతో మూడు పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే తుది కసరత్తులో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక ఫార్ములా ప్రకారం ముందుకెళ్తున్నట్లు సమాచారం. 60 శాతం పదవులు టిడిపికి, 30% జనసేన కు, 10 శాతం బిజెపికి కేటాయిస్తారని తెలుస్తోంది.అయితే దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. పొత్తులో భాగంగా ఎక్కువ శాతం త్యాగాలకు పాల్పడింది తెలుగుదేశం పార్టీ. అందుకే మా పార్టీకి సింహభాగం పదవులు కేటాయించాలని ఆ పార్టీ శ్రేణులు కోరుతున్నారు.మరోవైపు జనసైనికులు సైతం మెజారిటీ పదవులు జనసేనకు కేటాయించాలని కోరుతున్నారు. టిడిపి తో సమానంగా పదవులు కోరుతున్నారు. పొత్తులో భాగంగా తక్కువ సీట్లు తీసుకున్నామని.. కూటమి అధికారంలోకి రావడానికి పవన్ ప్రధాన కారణమని జనసైనికులు వాదిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడుతున్న వారికి పదవులు కేటాయించాలని కోరుతున్నారు. టిడిపి తో సమానంగా పదవులు ఇస్తేనే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టులపై చాలా ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు నియోజకవర్గస్థాయిలో అన్ని పదవుల్లో తమకు సింహభాగం ప్రయోజనాలు కల్పించాలని కోరుతున్నారు.బిజెపిలో విచిత్ర పరిస్థితి. ఆ పార్టీ సుదీర్ఘకాలంగా ఏపీలో ఉన్నా.. సొంతంగా అధికారంలోకి వచ్చే బలం లేకపోవడం విశేషం. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. మూడు ఎంపీ సీట్లను గెలుపొందింది. కానీ నామినేటెడ్ పదవుల విషయంలో వెనుకబడింది. ఈ ఎన్నికల్లో బిజెపి సీనియర్లకు పదవులు దక్కలేదు. కొత్తగా పార్టీలో చేరిన వారికే టికెట్లు కేటాయించారు. అయితే పాత నేతలంతా నామినేటెడ్ పదవులు కోరుతున్నారు. రాష్ట్రస్థాయి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# రుషికొండ రహస్యాలు....

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ విశాఖపట్టణం, సెప్టెంబర్ 20:** ఏపీలో ఎన్నికలు పేదోడికి, పెత్తందార్లకు మధ్య యుద్ధమని.. ప్రచారం సమయంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పదేపదే పేర్కొన్నారు. అలాంటాయన తిరిగి అధికారంలోకి వస్తానన్న ధీమాతో విశాఖ రుషికొండపై నివాసానికి నిర్మింపచేసుకున్న ప్యాలెస్ అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. కూటమి ప్రభుత్వానికి ఇప్పుడది వైట్ ఎలిఫెంట్‌లా మారింది. దాని నిర్మాణానికి రుషికొండకు కూలగొట్టిన కాటేజీలు.. అప్పట్లో అసలు ఏం జరిగిందన్న దానిపై ప్రభుత్వం విచారణ జరిపిస్తుంది. అయితే ఆ ఎంక్వయిరీ టీమ్‌లో ఉన్న అధికారులు ఇంకా వైసీపీ విధేయత ప్రదర్శిస్తుండటంతో.. నిజాలు మరుగున పడిపోతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖపట్నంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను ఏం చేసుకోవాలో? ఎలా వినియోగించుకోవాలో? కూటమి సర్కారు అంతుపట్టడం లేదు సుమారు 560కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఈ ప్యాలెస్ ఏపీ వాసులనే కాదు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరిని షాక్ కి గురిచేసింది. వైట్ హౌస్‌ను మరిపించేలా కట్టించిన ఆ ప్యాలెస్ ప్రపంచ సంపన్నులనే ఆశ్చర్యపోయేలా చేస్తోంది. రుషికొండ పర్యాటక కేంద్రంగా విశాఖకు తలమానికంగా నిలుస్తుంది. వైసీపీ సర్కారు ఏర్పాటే నాటికే రుషికొండపై పర్యాటకుల సౌకర్యార్థం పలు కాటేజీలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక జగన్ కన్ను రుషికొండపై పడింది. ప్యాలెస్‌లలో ఉండటానికి మాత్రమే ఇష్టపడే మాజీ ముఖ్యమంత్రి తాడేపల్లిలో నివాసానికి కూడా రాజ భవనాన్నే కట్టించుకున్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించిన జగన్.. అక్కడ నుంచే పాలన సాగించాలని ఫిక్స్ అయ్యారు. మళ్లీ సీఎం అవుతానన్న ధీమాతో రుషికొండపై కాటేజీలను పడగొట్టించి.. సీక్రెట్‌గా ప్యాలెస్ కట్టించేశారు. ప్రతిపక్షాల్ని, ప్రజల్ని, ఎవ్వరినీ కొండ దరిదాపుల్లోకి కూడా రానీయకుండా.. వైసీపీ నాయకులకే కాంట్రాక్టు ఇచ్చి ఏడు భవన సముదాయాలను పూర్తి చేయించారు. అదేదో నిషేధిత ప్రదేశంలా ఎవ్వరినీ రానియ్యకుండా నిర్మాణాలు చేపట్టారు. పచ్చదనంతో కళకళలాడే రుషికొండను బోడి కొండగా మార్చి విలాసవంతమైన భవనాలు నిర్మించారు. మాయాబజార్ సినిమాలోని మయసభను తలపించేలా పెద్దపెద్ద గదులు, హాల్స్, ఫర్నీచర్‌తో నింపేశారు. అనుమతులు లేకపోయినా.. జగన్ ప్రభుత్వం మాత్రం



వెనక్కి తగ్గలేదు. సర్వత్రా విమర్శలు రావడంతో పర్యాటక భవనాలని తొలుత ప్రచారం చేసి తర్వాత పరిపాలన భవనాలని ప్లేట్ మార్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రాజకోట రహస్యం బయట పడింది.ఆ మయసభ వైభోగం బయటపడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఆశ్చర్యపోయారు. అంతటి పాలనా అనుభవం ఉన్న సీబీఎన్నే .. ఆ ప్యాలెస్‌ను ఎలా వినియోగించుకోవాలో అంతుపట్టడం లేదంటున్నారు. దాన్నేం చేయాలో మీరే చెప్పండని ప్రజల్నే కోరుతున్నారు. ఆ క్రమంలో అప్పట్లో కాటేజీల కూల్చివేత, అక్రమ కట్టడాలపై విచారణలకు ఆదేశించారుగత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అన్ని వ్యవహారాలపై కూటమి నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు వాటిపై విచారణలు మొదలయ్యాయి. అయితే పర్యాటకాభివృద్ధి సంస్థలో కొందరు ఉన్నతాధికారులు గత వైసీపీ ప్రభుత్వంపై ఇంకా కృతజ్ఞత చాటుకుంటూనే ఉన్నారంట. అప్పట్లో జరిగిన ఘోర తప్పిదాలు బయటకు రాకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారంటున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన వివిధ అక్రమాలపై అదే ప్రభుత్వంలో కీలక స్థానాల్లో పని చేసిన అధికారులకే వారు విచారణ బాధ్యత అప్పగించడమే అందుకు నిదర్శనమంటున్నారు.విశాఖలో పలు పర్యాటక ప్రాజెక్టులను గత ప్రభుత్వం కొందరు ప్రైవేటు వ్యక్తులకు అడ్డగోలుగా కట్టబెట్టిందన్నది ప్రధాన ఆరోపణ.. అంతేకాక రుషికొండపై కాటేజీలు కూల్చేసినపుడు అందులోని రూ.కోట్ల విలువైన మంచాలు, సోఫాలు, ఏసీలు, డైనింగ్ టేబుళ్లు వంటివి అప్పటి అధికారులు కొందరు మాయం చేశారన్న ఆరోపణలున్నాయి. వాటిపై స్ట్రిక్ట్ ఆఫీసర్స్‌తో విచారణ చేయించాల్సిన రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాలను నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గత ప్రభుత్వంలో పర్యాటకశాఖ మంత్రిగా పనిచేసిన రోజా వద్ద ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పని చేసిన రాజారాం మనోహర్‌కు రుషికొండ కాటేజీల ఫర్నీచర్‌పై విచారణ బాధ్యతలు అప్పగించడం ఆ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. రాష్ట్ర ఆడిట్‌శాఖలో డిప్యూటీ డైరక్టర్‌గా ఉన్న మనోహర్‌ఎన్నికలకు ముందువరకూ మంత్రి రోజా వద్ద ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి కొద్ది రోజుల ముందు డిప్యుటేషన్‌పై రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు వచ్చారు. అక్కడ కూడా అప్పట్లో కీలకమైన విజిలెన్స్, మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్‌గా ఆయన్ని నియమించారు.విశాఖలో ప్రాజెక్టులు, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన పనులకు సంబంధించి మాజీ మంత్రి రోజా దగ్గర ఓఎస్డీగా పనిచేసిన ఆ అధికారితో విచారణ జరిపించాలని ఇటీవల ఉన్నతాధికారులు నిర్ణయించారు. దాంతో విశాఖలో ఏం జరిగిందన్న వాస్తవాలు వెలుగులోకి తేవాలన్న ఉద్దేశం ఉన్నతాధికారుల్లో ఉన్నట్లు కనిపించడం లేదంటున్నారు. విజిలెన్స్ విభాగంలోని మరికొందరు అధికారులు, ఉద్యోగులతో కలిసి ఆ రోజా మాజీ ఓఎస్డీ తాజాగా విశాఖకు వెళ్లి తూతూమంత్రంగా విచారణ జరిపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రోజా టూరిజం మినిస్టర్‌గా ఉన్నప్పుడే రుషికొండ ప్యాలెస్ నిర్మాణం జరిగింది. మాజీ అయ్యాక రోజాపై కూడా వందల కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెపై కూడా రేపో మాపో విచారణ కమిషన్ వేసే అవకాశముందంటున్నారు. అలాంటి రోజా దగ్గర పనిచేసిన అధికారిని ఇప్పుడు విచారణకు నియమించడంతో హైలెవల్ బ్యూరోక్రాట్లపై లేనిపోని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా విజిలెన్స్, ఈడీ, సీఐడీ వంటి సంస్థలతో విచారణ చేయిస్తే గత ప్రభుత్వంలో జరిగిన బాగోతాలు బయటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి ప్రభుత్వ పెద్దలు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

## జనసేన గూటికి కేతిరెడ్డి, విడుదల




**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 20:** ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కొక్కరుగా బయటపడేందుకు లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జగన్ సమీప బంధువు అయిన బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయబాను ఇప్పటికే పవన్ కల్యాణ్ తో సమావేశం అయ్యారు. ఉదయభాను ఎన్నికలకు ముందే పార్టీ మారుతారన్న ప్రచారం జరిగింది కానీ ఎక్కడా సీటు లభించే అవకాశం లేకపోవడంతో వైసీపీలోనే కొనసాగారు. జగ్గయ్యపేట నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు జనసేనలో చేరేందుకు రెడీ అయ్యారు.వైసీపీ నేతల నుంచి జనసేన పార్టీకి చాలా ఎంక్వయిరీలు వస్తున్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డితో పాటు మాజీ మంత్రి విడదల రజనీ కూడా పవన్ కల్యాణ్ అపాయింట్ మెంట్ కోరినట్లుగా తెలుస్తోంది. జనసేనలో చేరే అంశంపై వీరు ఇప్పటికే కీలక నేతలతో చర్చలు జరిపారని అంటున్నారు. కేతిరెడ్డి చేరికపై టీడీపీ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ధర్మవరంలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. అక్కడ బీజేపీకి సీటు కేటాయించినా.. టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ దగ్గరుండి ఆయన కోసం పని చేసి గెలిపించారు. ఇప్పుడు కూటమిలోకి కేతిరెడ్డి వస్తే.. స్వాగతించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. కేతిరెడ్డి, పరిటాల వర్గాల మధ్య చాలా కాలంగా వివాదాలు ఉన్నాయి. ఇక విడదల రజనీ కూడా..జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆమె బీజేపీలో చేరుతారన్న ప్రచారం జరిగినప్పటికీ.. జనసేన అయితే మంచిదన్న ఉద్దేశంతో ప్రాథమిక చర్చలు జరిపారని అంటున్నారు. కానీ చిలుకలూరిపేటలో విడదల రజనీ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి. పలువురు వ్యక్తులు తమ దగ్గర కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తున్నారు. కొన్ని కేసులు నమోదయ్యే అవకాశం కూడా ఉంది. ఇలాంటి సమయంలో ఆమెను జనసేనలో చేర్చుకోవడం మంచిది కాదని కూటమి పార్టీల నుంచి జనసేన పార్టీకి సంకేతాలు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఈ అంశంపై జరుగుతున్న చర్చల్లో స్పష్టత వస్తే.. విడదల రజనీ కూడా జనసేనలోకి చేరే చాన్సులు ఉన్నాయని అంటున్నారు. ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకూ వైసీపీ పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉందని.. సమీప భవిష్యత్ లో కోలుకుంటుందన్న నమ్మకం లేకపోవడంతో ఎక్కువ మంది జనసేన వైపు చూస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎంత మంది నేతలు వచ్చినా.. కూటమి పార్టీలతో చర్చించిన తర్వాతే చేరికలపై స్పష్టత ఇవ్వాలని జనసేన భావిస్తోంది. బీజేపీతోనూ కొంత మంది నేతలు టచ్ లో ఉన్నట్లుగా చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ నుంచి మరింత ఎక్కువగా నేతల వలస ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## 21 నుంచి పురటాసి శనివారాలు



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరుమల, సెప్టెంబర్ 20:** కలియుగ వైకుంఠంనాథుడు శ్రీ వేంకటేశ్వర స్వామి. ఆయన ఈ భూమి పై అవతరించిన మాసం పురటాసి మాసంగా భక్తులు భావిస్తారు. తమిళలు పురాటాసి (పెరటాసి), (తిరుమల శనివారాలు)గా పిలుస్తారు. తమిళలు ఈ మాసం లో స్వామి వారిని దర్శించుకోవడానికి ఇష్టపడుతారు. ఈ నెల మొత్తం చాల భక్తి శ్రద్ధలతో స్వామి వారిని ప్రార్థిస్తారు. మద్యం, మాంసం లేకుండా స్వామి వారిని స్మరిస్తూ దూర ప్రాంతాల నుంచి సైతం కాలినడకన తిరుమలకు వస్తారు భక్తులు. ఈ సాంప్రదాయం తమిళులు ప్రారంభించినా నేటికి స్వామి వారి భక్తులు ఎక్కడ ఉన్న ఈ పురటాసి మాసాన్ని ఆచరిస్తారు.తిరుమల శ్రీవారి దర్శనం కోసం భక్తులు తిరుపతి నుంచి అలిపిరి లేదా శ్రీవారి మెట్టు మార్గంలో నుంచి తిరుమలకు చేరుకుంటామని అందరికి తెలుసు. నడవలేని భక్తులు వాహనాలు, బస్సుల్లో తిరుమలకు వస్తారు. మరీ వందల కిలోమీటర్లు భక్తులు తిరుమలకు పాదయాత్రగా వస్తారని తెలుసా.పురటాసి మాసం లో తమిళనాడు, కర్ణాటక, ఏపీ నుంచి వచ్చే భక్తులు తమ గ్రామాలు నుంచి అందరూ గోవింద మాలధారణ చేస్తారు. పురటాసి మాసం మొత్తం గ్రామాలకు గ్రామాలు తరలి పాదయాత్రగా తిరుమలకు ప్రయాణం అవుతారు. పసుపు రంగు బట్టలు ధరించి గోవింద స్మరణ చేస్తూ తిరుపతికి చేరుకుంటారు. ఇక్కడ తిరుమల మెట్ల పూజ చేసి అనంతరం సప్తగిరులను అధిరోహిస్తారు. తిరుమలకు రాలేని భక్తులు తమ ఇంటి వద్ద స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పిండి దీపాలు వెలిగించి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి ప్రార్థిస్తారు. ఇది పురటాసి మాసంలో ప్రతి శనివారం నిర్వహించే కార్యక్రమంగా మారిపోయింది. ఈ మాసం కోసం ఏడాది పాటు భక్తులు వేచి చూస్తారు అంటే ఆశ్చర్యం వేయక మానదు.దేశంలోని శ్రీవారి భక్తులు తిరుమల శనివారాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. తమకు ఉన్నదానిలో స్వామి వారిని పూజిస్తారు. తమిళనాడు, కర్నాటక నుంచి వందలాది కిలో మీటర్లు భక్తులు పాదయాత్ర చేసి తిరుమల శ్రీవారి దర్శించుకుంటారు. ఇలాంటి భక్తులకు పూర్వం శ్రీకృష్ణ దేవరాయలు మండపాలను కట్టించారని ప్రతీతి. పాదయాత్రగా వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకునే పరిస్థితి ఉండేది. అయితే ఇలాంటి మండపాలు నేటికి కొన్ని అందుబాటులో ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి ఏపీలోకి ప్రవేశించే నగరి, చిత్తూరు, సత్యవేడు ఇలాంటి ప్రాంతాల్లో మండపాలు కొన్నింటిని నేటికి పరిరక్షించారు. అయితే మరికొన్ని శిథిలావస్థకు చేరుకుంది. వాటిని పునఃనిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు.తిరుమల కు వచ్చే భక్తులకు టీటీడీ అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. తిరుపతిలో కొన్ని సౌకర్యాలు ఉన్నా అవి పూర్తి స్థాయిలో లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరి పాదయాత్రగా వచ్చే భక్తుల కష్టాలు అయితే వర్ణనాతీతం. పాదయాత్ర కోసం వచ్చే భక్తులకు సరైన వసతి సౌకర్యాలు లేవు. పూర్వం ఉన్న మండపాలు లేవు. నీరు, నీడ లేక అవస్తలు పడుతున్నారు భక్తులు. రోడ్డులో ఉన్న ఆలయాలు, ఫుట్ పాత్ లు, బస్ షెల్టర్ వద్ద విశ్రాంతి తీసుకునే పరిస్థితి నెలకొంది. పాదయాత్రగా వచ్చే భక్తులకు కొందరు స్వచ్ఛందంగా సేవ చేస్తున్న టీటీడీ చొరవ తీసుకుని ఇలాంటి భక్తులకు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.పురటాసి మాసం ఈనెల 17 వ తేదీ ప్రారంభమైంది. ఈనెల 21న మొదటి శనివారం, ఈనెల 28న రెండో శనివారం, అక్టోబర్ 5న మూడో శనివారం, అక్టోబర్ 12న నాలుగో శనివారం నిర్వహిస్తారు. అక్టోబర్ 15వ తేదీతో పురటాసి మాసం ముగుస్తుంది. ఈ మాసంలోనే తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అక్టోబర్ 4 నుంచి 12 వ తేదీ వరకు ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తుంది.




## కేరళను వణికిస్తున్న వైరస్‌లు

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరువనంతపురం, సెప్టెంబర్ 2:** కేరళను వైరస్‌లు వణికిస్తున్నాయి. ఇప్పటికే.. మంకీ పాక్స్ కేరళను షేక్ చేస్తుండగా.. నిఫా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. అంతేకాదు.. ఒకే వ్యక్తిలో అటు నిఫా.. ఇటు మంకీపాక్స్ లక్షణాలు బయటపడుతుండడం కేరళను మరింత కుదిపేస్తోంది. మంకీ పాక్స్.. నిఫా వైరస్ వ్యాప్తితో కేరళతోపాటు సరిహద్దు రాష్ట్రాలు అలెర్ట్ అయ్యాయి. తమిళనాడు- కేరళ బోర్డర్‌లో హైఅలెర్ట్ ప్రకటించి తనిఖీలు ముమ్మరం చేయడం కలకలం రేపుతోంది.కరోనా తగ్గిందిలే అనుకునే లోపే.. వరుస వైరస్‌లు ప్రపంచాన్ని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం వరల్డ్ వైడ్‌గా పలు దేశాలను వణికిస్తోన్న నిఫా వైరస్, మంకీపాక్స్ మనదేశంలోనూ హడలెత్తిస్తున్నాయి. ప్రధానంగా.. కేరళను ఆ రెండు వైరస్‌లు కలవరపెడుతున్నాయి. ఇటీవల యూఏఈ నుంచి వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి మంకీపాక్స్ వైరస్ సోకినట్లు కేరళ వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన ఆయన మంకీపాక్స్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు తెలిపింది. మంజేరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని శాంపిల్స్‌ను కోజికోడ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపగా.. పాజిటివ్‌గా తేలింది. దాంతో.. దేశంలో రెండో మంకీపాక్స్ కేసు రికార్డ్ అయింది. అలెర్ట్ అయిన కేరళ అధికారులు.. దుబాయ్ నుంచి వచ్చిన ఆ వ్యక్తి ఎవరెవర్ని కలిశారో వారిని ట్రేస్ చేసే పనిలో పడ్డారు. 16మందిని గుర్తించి ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. ఈనెల 9న తొలి మంకీపాక్స్ కేసు నమోదు అయింది.ఒకవైపు కేరళను మంకీపాక్స్ వణికిస్తుండగా.. ఇప్పుడు నిఫా వైరస్ మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా.. ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ కావడం కలకలం రేపుతోంది. అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. అతనితో కలిసి ఉన్న 268 మందిని ఐసొలేషన్‌లో ఉంచారు కేరళ అధికారులు. వారిలో 81 మంది హెల్త్ కేర్ వర్కర్స్, 177మంది ప్రైమరీ కాంటాక్ట్ ప్రజలు, 90మంది సెకండరీ కాంటాక్ట్ ప్రజలుగా గుర్తించారు. అయితే.. ప్రైమరీ కాంటాక్ట్ లిస్టులోని 134మందిని వైద్యులు హైరిస్క్ కేటగిరిలో ఉంచారు. ఇద్దరికి నిఫా లక్షణాలు ఉన్నట్లు తేలడంతో స్థానిక మంజేరి మెడికల్ కాలేజ్‌కు తరలించారు. వీళ్లిద్దరితోపాటు మొత్తం ఎనిమిది మందికి అక్కడ చికిత్స అందిస్తున్నారు. మరో 21మందిని పేరింతల్‌మన్నా ఆస్పత్రిలో జాయిన్ చేశారు.ఇదిలావుంటే.. కేరళలోని మలప్పురంలో నిఫా వైరస్‌తోపాటు.. మంకీ పాక్స్ లక్షణాలున్న వ్యక్తులను గుర్తిస్తున్నారు అధికారులు. దానిలో భాగంగా.. తమిళనాడు- కేరళ సరిహద్దు జిల్లాల్లో అలెర్ట్ ప్రకటించారు. కేరళ నుంచి కన్యాకుమారి ద్వారా తమిళనాడుకు వస్తున్న వాహనాలపై నిఘా పెంచారు. పూర్తి వైద్య పరీక్షల తర్వాతే కేరళ నుంచి తమిళనాడులోనికి ప్రజల్ని అనుమతిసతున్నారు. 24 గంటలపాటు తనిఖీలు నిర్వహించాలని, వైరస్ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దాంతో.. నాగర్‌కోయిల్‌లో ప్రత్యేక మెడికల్ క్యాంప్స్ కూడా ఏర్పాటు చేశారు. అలాగే.. సరిహద్దు జిల్లాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు.నిఫా వైరస్ జంతువుల నుంచి నేరుగా మనుషులకు సోకుతుందని ఇప్పటికే అధికారికంగా తేలింది. తొలిసారి నిఫా వైరస్‌ను 1999లో గుర్తించారు. గబ్బిలాలు తిన్న పండ్లను తీసుకోవడం ద్వారా నిఫా వైరస్ మనుషుల్లోకి ప్రవేశిస్తుంది. ఇక.. వైరస్‌ల వ్యాప్తితో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. అన్ని దేశాలను అలెర్ట్ చేసింది. మరోసారి లాక్‌డౌన్ లాంటి పరిస్థితులు రాకుండా చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మొత్తంగా.. ఇటు మంకీపాక్స్.. అటు నిఫా వైరస్ వ్యాప్తితో కేరళ గజగజలాడుతోంది. వరుస కేసుల నమోదుతో భయపడిపోతోంది. అందులోనూ.. ఒకే వ్యక్తిలో రెండు

## తిరుపతి లడ్డూ ప్రసాదంలో అపచారం అక్కడే జరిగిందా..?



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరుమల, సెప్టెంబర్ 20:** తిరుమల శ్రీవారి లడ్డూపై సీఎం చంద్రబాబు చేసిన సంచలన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా దుమారం రేగింది. ప్రస్తుతం అన్ని మీడియా సంస్థల్లో చర్చ నడుస్తోంది. కొంతమంది చంద్రబాబు వ్యాఖ్యలపై ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు వైసీపీ హయాంలో జరిగింది వాస్తవమేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ తరుణంలో పలు ఆసక్తికర విషయాలు బయటకు వచ్చాయి. 50 ఏళ్లుగా తిరుమల లడ్డూలో ఉపయోగించే కర్ణాటకకు చెందిన కేఎంఎఫ్‌కి చెందిన నందిని నెయ్యిని జగన్ రెడ్డి ఎందుకు ఉన్నట్లు ఉండి తొలగించాడో ఇప్పుడు అర్థమైందా ? అంటూ టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు.తిరుపతి లడ్డూ తయారీకి 50 ఏళ్లుగా సరఫరా చేస్తున్న నందిని నెయ్యిని కాదని, తమిళనాడు కంపెనీకి ఎందుకు ఇచ్చాడో, ఇప్పుడు ప్రజలకు తెలిసింది. 50 ఏళ్లుగా నాణ్యతతో కూడిన నందిని నెయ్యిని జగన్ ఎందుకు వద్దు అన్నాడు ? తక్కువ ధరకు నెయ్యి అంటూ, నాణ్యత లేని నెయ్యి తీసుకొచ్చి, తిరుమల లడ్డూకి రుచి లేకుండా చేయడం వెనుక జగన్ రెడ్డి చేసింది కుట్ర కాక మరేంటి ? అంటూ ప్రశ్నిస్తున్నారు.మరోవైపు, తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఏపీసీసీ చీఫ్ షర్మిల మండిపడ్డారు. తిరుమల లడ్డూ తయారీలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారంటూ సీఎం చంద్రబాబు ఎలా మాట్లాడుతారని ఆరోపించారు. ఏకంగా వేంకటేశ్వరుడికి మచ్చతెచ్చేలా సీఎం మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా ఉపయోగిస్తే.. తక్షణం విచారణ కమిటీ వేయాలని చెప్పారు. దీంతోపాటు సీబీఐ విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్ చేశారు. తిరుమలను అపవిత్రం చేసిన నీచులెవరో నిగ్గుతేల్చాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.అలాగే, లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. దీనిపై తన కుటుంబంతో సహా ప్రమాణం చేయడానికి సిద్ధమేనని సవాల్ విసిరారు.అంతకుముందు, తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబు మంగళగిరిలో కూటమి ప్రభుత్వ శాసనసభాపక్ష సమావేశంలో ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రసాదంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారని ఆరోపణలు చేశారు. అలాగే జగన్ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. దేవుడి దగ్గర పెట్టే ప్రసాదాలను అపవిత్రం చేయడంతోపాటు తిరుమలలో దుర్మార్గంగా వ్యవహరించిందంటూ మండిపడ్డారు.ముఖ్యంగా భక్తులకు నాసిరకం లడ్డూలు, నాణ్యతలేని అన్నప్రసాదం పంపిణీ చేసిందంటూ ఆరోపించారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యిని వినియోగిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలకు రాష్ట్ర మీడియాతో పాటు దేశ వ్యాప్తంగా దుమారం రేగుతోంది.దేవదేవుడైన శ్రీ వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అలాంటి లడ్డూ తయారీలో వైసీపీ హయాంలో జంతువుల కొవ్వు వాడారాన్న సంచలన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు బయట పెట్టారు. ఈ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఊరకనే ఆరోపణలు చేయరు. బలమైన ఆధారాలు ఉండబట్టే చేసి ఉంటారని భావిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏపీలో ప్రభుత్వం మారిన వెంటనే టీటీడీ ఈవో సీనియర్ ఐఏఎస్ శ్యామలరావును ప్రభుత్వం నియమించింది. అప్పటి వరకూ కేంద్ర రక్షణ శాఖ ఉద్యోగిగా ఉన్న ధర్మారెడ్డి ఈవోగా ఉన్నారు. ఆయనకు అర్హతలు లేకపోయినా ఆ పోస్టు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. శ్యామలరావు ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే లడ్డూ ప్రసాదంపై వస్తున్న ఆరోపణలపై దృష్టి పెట్టారు. వెంటనే.. లడ్డూ ప్రసాదానికి వాడుతున్న పదార్థాలను తనిఖీ చేయించారు. నెయ్యిని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ లో టెస్టు చేయించారు. ఫలితాలు ఏమిటో బయట పెట్టలేదు కానీ.. వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టేశారు. బహుశా.. ఆ నివేదికలో జంతువుల కొవ్వు ఉందన్న రిపోర్టు వెలుగులోకి వచ్చి ఉంటుందని.. దాన్ని సీఎంకు తెలియచేసి ఉంటారని భావిస్తున్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అత్యంత క్వాలిటీతో ఉన్న పదార్థాలతోనే సరఫరా చేస్తారు. గత ఇరవై ఏళ్లకుగా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని మాత్రమే వాడుతున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిని బ్రాండ్ కు చెల్లిస్తున్న ధర కంటే తక్కువ ధరను నిర్ణయిస్తూ టెండర్లు పిలిచారు. ఆ ధర ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని నష్టాలు వస్తాయని నందిని టెండర్లలో పాల్గొనలేదు. ఈ కాంట్రాక్టులను.. యూపీకి చెందిన రెండు సంస్థలు దక్కించుకున్నాయి. ఆ సంస్థలు నెయ్యి ఎలా తయారు చేస్తాయన్నది పట్టించుకోలేదు. ప్రీమియర్ అగ్రి ప్రాడక్ట్స్, క్వాలిటి లిమిటెడ్ వంటి కంపెనీలకు ఇచ్చారు. నిజానికి ఇలాంటి నెయ్యి పేరు మోసిన డెయిరీలే సిద్ధం చేయగలవు. వీరు ఇచ్చే నెయ్యి క్వాలిటీని స్వతంత్ర సంస్థలతో కాకుండా తామే పరీక్షిస్తామని టీటీడీ అధికారులు ప్రకటించారు.నిజానికి శ్రీవారి లడ్డూలు తయారు చేయడానికి అవసరమైన అత్యంత నాణ్యమైన నెయ్యి.. ఆ యూపీ కంపెనీలు సరఫరా చేసినంత తక్కువ ధరకు రావు. కేవలం నందిని బ్రాండ్ నెయ్యి టెండర్లలో పాల్గొనకుండా చేయడానికే ఆ ధరను నిర్ణయించి ఉద్దేశపూర్వకంగా ఆ కంపెనీని తప్పించారని.. తమకు ఇష్టమైన కంపెనీలకు నెయ్యి సరఫరా టెండర్లు దక్కేలా చేశారని అప్పట్లోనే టీడీపీ ఆరోపణలు గుప్పించింది. కానీ టీటీడీలో ప్రతిదీ తాము టెండర్ల ద్వారానే కొనుగోలు చేస్తామని చెప్పి టీటీడీ ఆ నెయ్యినే కొనుగోలు చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు రక్షణ శాఖ ఉద్యోగిగా ఉన్న ధర్మారెడ్డినే కీలకంగా వ్యవహరించారు. జేఈవోగా ఉన్నా.. ఈవోగా ఉన్నా ఆయనదే పెత్తనం. నిజానికి ఐఏఎస్ అధికారులకే ఆ బాధ్యతలు ఇవ్వాలి. కానీ జగన్ మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో ధర్మారెడ్డినే టీటీడీలో కీలకంగా వ్యవహరించారు. టీటీడీ చైర్మన్ గా జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి , ఆ తర్వాత భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్లగా వ్యవహరించారు. జంతువుల కొవ్వును వాడారాని.. ఆ నెయ్యి విషయంలో వచ్చిన ల్యాబ్ రిపోర్టు బయటకు వస్తే.. హిందువుల మనోభావాలు దెబ్బతీసినట్లుగా వైసీపీ తీవ్రమైన విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# 2036 ఒలింపిక్స్ భారత్‌లో నిర్వహించి తీరుతాం: కేంద్రమంత్రి మన్‌సూఖ్ మాండవీయ



**హైదరాబాద్ పెన్ పవర్:** 2036 ఒలింపిక్స్ భారత్‌లో నిర్వహించి తీరుతామని కేంద్ర క్రీడ శాఖ మంత్రి మన్‌సూఖ్ మాండవీయ అన్నారు. ఇవాళ (సెప్టెంబర్ 20) హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని విజిట్ చేసిన మాండవీయ.. ఇటీవల ముగిసిన పారా ఒలింపిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన తెలంగాణ బిడ్డ, అథ్లెట్ దీప్తి జీవంజిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..- పిల్లల్ని క్రీడలలో ప్రోత్సహించాలని.. ఫిట్‌గా, హెల్తీగా ఉండాలంటే ఏదో ఒక ఆట ఆడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి క్రీడల్ని ప్రోత్సహిస్తున్నామని..- ప్రధాని మోడీ ఉద్దేశ్యం కూడా క్రీడల్ని, క్రీడాకారుల్ని ప్రోత్సహించడమేనని స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాల్లో క్రీడాసదుపాయాల్ని పెంచుతున్నామని అన్నారు. గ్రామీణ స్థాయి క్రీడకారుల ప్రతిభను వెలికి తీసేందుకు- ఖేలో ఇండియా పోటీలు నిర్వహిస్తున్నామని.. టాలెంట్ ఉన్న ప్లేయర్లకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. విశ్వక్రీడలు ఒలింపిక్స్‌లో భారత్ మెరుగైన ప్రదర్శన చేసేలా కృషి చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ అడ్వైజర్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. - కేంద్ర మంత్రి రాష్ట్ర పర్యటన ఉందని తెల్వగానే స్టేడియం విజిట్ చెయ్యాలని కోరామని.. సానుకూలంగా స్పందించి స్టేడియానికి వచ్చినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గత 10 ఏళ్లలో తెలంగాణలో క్రీడలు కనుమరుగయ్యాయని.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక మళ్లీ రాష్ట్రంలో క్రీడలు జీవం పోసుకుంటున్నాయన్నారు. క్రీడలకు ప్రభుత్వం బడ్జెట్ మంచి కేటాయింపులు చేసిందని.. ఇటీవలే ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ పోటీలు ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నానని.. స్టేడియాల రేనోవేషన్‌కి బడ్జెట్ కేటాయించాలని ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి సెంట్రల్ గవర్నమెంట్‌ను రిక్వెస్ట్ చేశారు.

# అంతర్జాతీయ క్రికెట్‌లో అదుర్స్.. 400 వికెట్ల క్లబ్‌లో బుమ్రా

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన హవా కొనసాగిస్తున్నాడు. ఫార్మాట్ ఏదైనా తన పేస్ తో ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. తాజాగా ఈ గుజరాత్ ఫాస్ట్ బౌలర్ ఇంటర్నేషనల్ క్రికెట్ లో 400 వికెట్లను పూర్తి చేసుకున్నాడు. చెన్నై వేదికగా ప్రస్తుతం బంగ్లాదేశ్ తో జరుగుతున్న తొలి టెస్టులో హసన్ మహ్మద్ వికెట్ తీసి ఈ ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్ లో మొత్తం నాలుగు వికెట్లు తీసుకున్న బుమ్రా..తన వికెట్ల సంఖ్యను 401కు పెంచుకున్నాడు. ఈ మ్యాచ్ లో తొలి బంతికే వికెట్ ను తీసుకున్న బుమ్రా.. రహీం, తస్కిన్ అహ్మద్, హసన్ మహమ్మద్ వికెట్లను పడగొట్టాడు. 2016 లో తొలిసారి బుమ్రా ఆస్ట్రేలియాపై వన్డే ద్వారా అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. 2016 లోనే తొలిసారి టీ20 ఆడగా.. 2018లో తొలిసారిగా టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. ఇప్పటివరకు 89 వన్డేల్లో 149 వికెట్లు.. 70 టీ20 మ్యాచ్ ల్లో 89 వికెట్లు.. 39 టెస్ట్ మ్యాచ్ ల్లో 159 వికెట్లు పడగొట్టాడు. చెన్నైలో జరుగుతున్న ఈ టెస్ట్ మ్యాచ్ విషయానికి వస్తే తొలి ఇన్నింగ్స్ లో భారత్ కు 227 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ప్రస్తుతం భారత్ రెండో ఇన్నింగ్స్ లో 11 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. క్రీజ్ లో గిల్ (21) కోహ్లీ (7) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్ లో భారత్ 376 పరుగులకు ఆలౌట్ కాగా.. బంగ్లాదేశ్ 149 పరుగులు మాత్రమే చేయగలిగింది.



# స్వల్ప స్కోర్‌కే బంగ్లా.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై టెస్టులో భారత పేసర్ల ధాటికి బంగ్లాదేశ్ కుదేలైంది. కనీస పోరాటం లేకుండా తొలి ఇన్నింగ్స్ లో కేవలం 149 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ కు తొలి ఇన్నింగ్స్ లో 227 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. 32 పరుగులు చేసిన షకీబ్ ఉల్ హసన్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. శాంటో (20) , లిటన్ దాస్ (22), మెహదీ హసన్ మిరాజ్ (27) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో బుమ్రా నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆకాష్ దీప్, జడేజా,సిరాజ్ లకు తలో రెండు వికెట్లు లభించాయి. పాకిస్థాన్ పై వారి సొంతగడ్డపై సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన బంగ్లాదేశ్ భారత బౌలర్ల ధాటికి ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. వరుస విరామాల్లో వికెట్లను కోల్పోతూ తక్కువ స్కోర్ కే పరిమితమైంది. బుమ్రా, సిరాజ్, ఆకాష్ దీప్ చెలరేగడంతో ఒక దశలో బంగ్లా 40 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో షకీబ్, లిటన్ దాస్ ఆరో వికెట్ కు 51 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే జడేజా ఈ జోడీని విడదీయడంతో బంగ్లా మిగిలిన వికెట్లను చక చక కోల్పోయింది. అంతకముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్ లో 376 పరుగులకు ఆలౌటైంది. అశ్విన్ సెంచరీ (113) తో చెలరేగగా.. జడేజా (86), జైశ్వాల్ (56) హాఫ్ సెంచరీలతో కీలక ఇన్నింగ్స్ లు ఆడారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహమ్మద్ కు ఐదు వికెట్లు దక్కాయి. మరో మూడు రోజుల ఆట మిగిలి ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ లో భారత్ విజయం ఖాయంగానే కనిపిస్తుంది.

# ఎన్టీఆర్ మైండ్‌లో టాప్-3 తమిళ్ డైరెక్టర్స్



ప్రియాంక అరుల్ మోహన్ స్టైల్ ఎల్లప్పుడూ ఆన్-ఫ్లీక్





సురభి జ్యోతి యొక్క ఫ్యాషన్ ప్రకటనలు కేవ

**హైదరాబాద్ పెన్ పవర్:** డైరెక్టర్స్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తెలుగులో అగ్ర దర్శకులతో పని చేస్తున్నారు. కొరటాల శివ, రాజమౌళి, సుకుమార్, త్రివిక్రమ్ శ్రీనివాస్, వివి వినాయక్ లాంటి టాప్ డైరెక్టర్లతో బ్లాక్ బస్టర్లు సొంతం చేసుకున్నాడు. కొరటాలతో 'జనతా గ్యారేజ్' అద్భుత విజయం సాధించింది. మరోసారి 'దేవర' కోసం ఈ జోడీ కలిసి పని చేసారు. దేవర ఈనెల 27న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా కేటగిరీలో అత్యంత భారీగా విడుదలవుతున్న దేవరను తమిళంలోను ప్రతిష్ఠాత్మకంగా విడుదలకు సిద్ధం చేసారు. అక్కడ ఎస్వీ ప్రసాద్ లాంటి దిగ్గజం దేవరను విడుదల చేస్తుండడం ట్రేడ్ లో ఉత్సాహం పెంచింది.

ఈ సందర్భంగా కొద్దిరోజులుగా ఎన్టీఆర్ చెన్నైలో 'దేవర' తమిళ వెర్షన్ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. అక్కడ పలు మీడియా ఇంటర్వ్యూల్లో తారక్ తమిళ దర్శకులపై ప్రశంసలు కురిపించారు. ఇంతకుముందే జాతీయ ఉత్తమ దర్శకుడు వేట్రి మారన్ తో పని చేయాలనుందని ఎన్టీఆర్ అన్నారు. వేట్రి సర్ ఒక తమిళ సినిమాలో అవకాశం కల్పిస్తే నటించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎన్టీఆర్ అభ్యర్థించారు. తాజా ఇంటర్వ్యూలో అట్లీ కుమార్ తోను ఓ సినిమా చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు. గతంలో ఓ కొత్తదనం ఉన్న రొమాంటిక్ లవ్ స్టోరీని అట్లీ తనకు వినిపించారని, ఇద్దరం కలిసి దీనిపై చర్చించామని తారక్ చెప్పారు. అయితే మా ఇద్దరికీ వరుసగా సినిమాలు ఉన్నాయి. కాల్షీట్లు కుదరకపోవడంతో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదని తారక్ తెలిపారు. అట్లీ తెరకెక్కించిన రాజా రాణి తనకు బాగా నచ్చిన సినిమా అని కూడా ఆయన అన్నారు. %ూశ్రీంశీ =ఝుం% - అసలు సంపూర్ణేష్ బాబు ఎక్కడ? అలాగే లోకేష్ కనగరాజ్ 'విక్రమ్'పైనా తారక్ ప్రశంసలు కురిపించారు. విక్రమ్ పరిశ్రమ గౌరవాన్ని పెంచిందని ఎన్టీఆర్ వ్యాఖ్యానించారు. రజనీకాంత్ జైలర్ లో చాలా స్పెషల్ గా కనిపించారు. ఇప్పటివరకూ అలాంటి పాత్రలో ఆయనను చూడలేదు అని కూడా అన్నారు. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ పైనా ప్రశంసలు కురిపించారు. రాయన్ చిత్రంలో ధనుష్ నటన అద్భుతంగా ఉందని తారక్ ఈ ఇంటర్వ్యూలో ప్రశంసించారు. మొత్తానికి తమిళ ఇంటర్వ్యూల్లో తారక్ తన ఫేవరెట్ తమిళ దర్శకుల జాబితాను బయటపెట్టాడు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com